# నవ్వుతూ వెళ్ళిపోయిందా మనిషి....

శ్రీకాకుళం ప్రాంతాల్నుంచొచ్చిన కోటమ్మ నల్లగా, కండలు తిరిగిన శరీరంతో ఉంటది. ఎత్తు అయిదున్నర అడుగులు పైనే ఉంటది. అక్కడక్కడా మెరిసిన చింపురు జుట్టుతో, ముతకనేత చీర మోకాళ్ళ పైదాకా కట్టి కచ్చాపోసుకుంది.

చెల్లూరులో కొద్దిపాటి డబ్బున్నోళ్ళలో రామయ్యచౌదరొకడు. వాళ్ళింట్లో పని చేస్తుంది కోటమ్మ. పగలంతా చౌదరి గారింట్లో పన్లు చేసి రాత్రయ్యేసరికి వూరి చివర స్మశానం దగ్గరున్న దొడ్డిసందులో ఉన్న చౌదరిగారి దూళ్ళ సావిట్లో పడుకుంటది.


చంపబడ్డారో, ఆత్మహత్య చేసుకున్నారో తెల్దుగానీ పదేళ్ళక్రితం రామయ్యచౌదరిగారి దొడ్లో ఒక ఆడపిల్లా, ఒక కుర్రాడు చనిపోయేరు. వాళ్లిద్దరూ దెయ్యాలై తిరుగుతున్నారని చెప్పుకునేవారు. కొంచెం పొద్దుపోతే చాలు మనిషన్నోడెవడూ ఆ ప్రాంతాలకెళ్ళేవారు కాదు. కోటమ్మమట్టుకి రాత్రిళ్ళు వెళ్ళి ఆ దొడ్లో పడుకుంటూంటే వూళ్ళోవాళ్ళంతా ఆ మనిషి ధైర్యానికి తెగ మెచ్చుకునేవారు.

కోటమ్మ పన్లోకెళితే ఒక మగాడు పోటీపడ్లేక పోయేవాడు. అంత బలమైన మనిషి. ఒక పని మొదలెట్టిందంటే ఎంత రాత్రయినా అది పూర్తయ్యేదాకా వదిలేదు కాదు. ఆ పనితనం చూసినోళ్ళంతా ''కోటా మా ఇంటికి రావే... మా ఇంటికి రావే'' అని పిలుస్తుంటే..నవ్వేస్తా 'నేను నమ్ముకున్న రామయ్య చౌదరిగారింట్లో తప్పా, ఎక్కడా పని చెయ్య''నని సుతిమెత్తగా చెప్పేసేది కోటమ్మ.

నీది ఏ ఊరు, అమ్మానాన్నా ఉన్నారా? పెళ్ళయిందా నీ పెనిమిటి ఎవరు? ఎంతమంది పిల్లలు అనడిగితే 'నేను తూర్పు నించొచ్చాను'' అనేసి మరో ప్రశ్న ఎదరోళ్ళు వెయ్యకండా తమాషాగా నవ్వుతూ వెళ్ళిపోయేదక్కడ్నించి.

కోటమ్మ కబుర్లు చెపుతుంటే వినాలనిపిస్తది. మాటలు కల్పించి చెప్పినట్టుండవు మా గోపాలస్వామిగుడి దగ్గర రాలిన పారిజాతాల్లాగా తెల్లగా నవ్వుతా శ్రీకాకుళం యాసలో మాటాడ్తుంటే భలేగుంటాయి.

ఆవేళ రామయ్యచౌదరిగారింట్లో పనయిపోయేకా పోస్ట్‌మేన్ గౌసుగురించి అడిగితే ''ఆడు చంటిరెడ్డిగారి హొటేల్లో టీ తాగుతున్నాడని'' చెప్పేడు కిళ్ళీకొట్టు వీరబాబుగాడు.



గబగబా నడుచుకుంటా
రెడ్డిగారి హోటేలు దగ్గరకెళ్ళి అడిగితే
"గొడితోరి సావిట్లోకెళ్ళేడు" అని చెప్పేడు రెడ్డి.

గబగబా ఆ పక్కకి పరుగెట్టింది.

పోస్టుమెన్ గౌసు వయసు అరవైఏళ్ళుపైనే. డొక్కు సైకిలు హేండిలుకి ఉత్తరాలున్న కాకీసంచి తగిలించుకుని సైకిల్ని నడిపించుకుంటా తిరుగుతాడు. అతను సైకిలెక్కి తొక్కడం చెల్లూరోళ్ళెవరూ చూళ్ళేదట.

దగ్గిర దగ్గిర పరుగెడ్తున్నట్టే నడుస్తా గొడితోరి ఇంటికెళ్ళిన కోటమ్మకి గౌసు ఫోస్టాఫీసు కెళ్ళిపోయేడని చెప్పేడు గొడితోరి అబ్బుగారు.

చెల్లూరు ఊళ్ళో పోస్టాఫీసు లేదు. సుగరు ఫేక్టరీ క్వార్టర్స్ కెళ్ళేదారిలో ఫేక్టరీ స్టోర్స్ పక్కనుంది. ఊళ్ళోవాళ్ళు అక్కడికెళ్తే ఉత్తరాలూ, రిజిస్టర్ పోస్టులూ, ఎమ్మోలూ చేస్తుంటారు. రామచంద్రపురంలో ఉండే పోస్టుమేస్టరు పొద్దుట పదిన్నరకొచ్చి రెండున్నరకెళ్ళిపోతాడు.

అగులు గుద్దుకుంటా పోస్టాఫీసు కొచ్చిన కోటమ్మకి పోస్టుమెన్ గౌసు పోస్టాఫీసులో కనపడలేదుగానీ ఫేక్టరీ మేనేజరు ప్రసాదరావుగారి క్వార్టర్స్‌లో వాళ్ళమ్మాయి రామలక్ష్మి ఇచ్చిన కాఫీ తాగుతా కనపడ్డాడు.

ఒగురుస్తా వచ్చి నిలబడ్డ కోటమ్మ "గౌసుగారూ... మా చినమేరంగినించి కార్డొచ్చిందా?" అంది.

నవ్వేసిన గౌసు "వస్తే పనిగట్టుకు వచ్చి మరీ ఇస్తానుగదా దానికింత గేలాపెత్తుకుని రావాలేటే కోటమ్మా" అన్నాడు.

నీర్సంగా నడుచుకుంటా వెళ్ళిపోయింది కోటమ్మ.

గుత్తుల కొండయ్యకు చిన్నప్పుడు పోలియో వచ్చి కుంటుతా నడుస్తుంటాడు. కొండయ్య ఆస్తిపరుడే కాకుండా మంచి రసికుడు కూడా. కుంటికొండయ్యకి వూళ్ళో రత్తాల్నిచ్చి పెళ్ళి చేసారు. మొదట్లో రత్తాలుతో సంసారం బాగానే చేశాడు. కొన్నాళ్ళకి పక్క ఊళ్ళో ఉన్న కృష్ణవేణిని ఎవరికీ తెలీకండా పెళ్ళి చేసుకున్నాడు.

అది రత్తాలికి తెల్సిపోయింది. కుంటోడి ఇంట్లో ప్రతీరోజూ గొడవ. ఇద్దరి భార్యల్ని విడిచిపెట్టలేక, వాళ్ళని ఒకటి చెయ్యలేక నలిగిపోతున్నాడు. తన ఇద్దరి భార్యల్ని ఏకం చెయ్యమని ఊళ్ళో ఎవరికి చెప్పినా కుంటోడ్ని తిట్టేవారు. ఈ విషయం ఎవరికీ చెప్పకండా తనలో తను బాధపడుతూ ఒకరోజు కోటమ్మదగ్గరకెళ్ళి వెళ్ళగక్కాడు.

విన్న కోటమ్మ మొదటిభార్య రత్తాలుకి, రెండవభార్య కృష్ణవేణికి ఎలా నచ్చచెప్పిందో, ఏవిధంగా వాళ్ళ మనసులు మార్చిందో తెల్దుగానీ మర్నాడు కుంటి కొండయ్యగాడు మంచి బట్టలు వేసుకుని ఇద్దరు పెళ్ళాల మీద చెరో భుజం మీదా చేతులు వేసుకుని జ్యోతి టాకీసులో సినిమాకు వెళుతుంటే మతిపోయినట్టు చూశారంతా.

కోటమ్మ దగ్గరకొచ్చిన కొండయ్య ఏం చెప్పి నా భార్యలిద్దర్నీ ఒకటి చేశావంటే నవ్వుతూ వెళ్ళిపోయింది తప్పా సమాధానం చెప్పలేదు.

వెంకట్రావు భార్య సత్తెమ్మ మాటలు విని, చిన్నప్పటినుంచి తనే ప్రాణంగా చూస్తూ, పెంచిన తల్లి మరియమ్మకి అన్నం పెట్టకండా, చెప్పుడు మాటలు విని తల్లిని కొట్టడం మొదలెట్టాడు.

వీళ్ళ గొడవ మా ఊరి పెద్ద మార్ని వీరాస్వామిగారి దగ్గరకొచ్చింది. వీరాస్వామి తగువులో వెంకట్రావు, సత్తెమ్మని మందలించి "మరియమ్మకి వయసయిపోయింది నువ్వే జాగ్రత్తగా చూసుకోవాలని" చెప్పాడు.




తగువు తీర్చినా ఎప్పటిలానే గొడవలు జరుగుతున్నాయి. మరియమ్మ వీరాస్వామికి చెప్పుకుంటుంది తన బాధ. వెంకట్రావును మందలిస్తానేవున్నాడు. జాగ్రత్తగా చూస్తానని వెళుతున్నాడు.

ఈ విషయం కోటమ్మకు తెల్సి ఒకరోజు వెళ్ళింది. వెంకట్రావు, సత్తెమ్మలకి ఏం చెప్పిందోగానీ, మర్నాటినించీ వాళ్ళిద్దరూ తమ ప్రాణాలుకంటే ఎక్కువగా చూసుకోడం మొదలెట్టారు మరియమ్మని.

వీరాస్వామికి తెల్సి కోటమ్మను పిల్చి ''ఎన్నోరకాలుగా వాళ్ళని పిల్చి తల్లిని జాగ్రత్తగా చూసుకోమ్మని చెపుతున్నాను. నా మాట వినలేదు. ఏం చెప్పి వాళ్ళ మనసులు మార్చావే'' అన్నాడు.

సమాధానం చెప్పకుండా నవ్వుతా వెళ్ళిపోయింది కోటమ్మ.



పోస్టుమేన్ గౌసుకి సొంత ఇల్లు లేదు. అద్దికొంపలు పట్టుకు తిరుగుతుంటాడు. కొన్నేళ్ళు పసలోరివీధిలోనూ, కొన్నాళ్ళు మార్నోరి సందులోనూ, కొన్ని నెల్లయితే నూనోరి సావిట్లోనూ అలా ఊరంతా తిరుగుతానే వున్నాడుగానీ సొంతకొంప సంపాయించుకో లేకపోయాడు. నలభై ఏళ్ళనించి ఉత్తరాలు పంచి పెడ్తున్నా ఉజ్జోగం పర్మినెంటు అవ్వలేదు. కాకినాడలో పరీక్షలు రాయాలి. రాసి ఆ పరీక్షల్లో పేసయితే ఉజ్జోగం పర్మినెంటు చేస్తారు. పేసవ్వకపోతే ఈ టెంపరరీ ఉజ్జోగంలోంచి తీసేస్తారు. పేసవ్వనేమో అన్న భయంతో పరీక్షలు రాయడం మానేసిన గౌసుకి పర్మినెంటు అవ్వలేదు. పైగా అతనికి రిటైర్‌మెంటు లేదు.

ఊళ్ళో ఎవరిగురించీ ఏవివరం కనుక్కోని కోటమ్మ గౌసు గురించి మట్టుకి ఎవరన్నా చెపితే హాయిగా వింటది. ఆవేళ కిళ్ళీకొట్టు వీరబాబుగాడు చెప్తుంటే ఆనందంగా వింటుంది. ఎందుకంటే ఆ ప్రపంచం మొత్తం మీద తనకి గొప్ప సంతోషం కలిగించే ఒక కార్డుముక్క తెచ్చిచ్చే మనిషి ఒక్క గౌసే. ఆరోజు ఎప్పుడొస్తదా అని ఎప్పుడూ ఆలోచిస్తా ఎప్పుడూ ఎదురుచూసే కోటమ్మకి గౌసుగురించి వినడం చాలా ఇష్టం.

ఊళ్ళో రకరకాల వీధులు తిరుగుతా నూనోరిసావిట్లో ఉంటున్న గౌసు ఇంటికెళ్ళి పడుకునున్న గౌసుని లేపి

''ఏంటి గౌసుబావూ... నాకేటన్నా కార్డుముక్కొచ్చినాదేంటి?'' అంది.

''వస్తే నువ్వెక్కడున్నా తెచ్చిస్తానుగందా కోటా'' అని నవ్వేడు.

చాలా నిరాశపడిపోయిన కోటమ్మ ''ఇవేళ తెల్లవారు ఝూముని నువ్వు నాకు కార్డు ముక్కిచ్చినట్టు కలొచ్చినాది గౌసుబావూ'' అనుకుంటా నీరసంగా వెనక్కి తిరిగెళ్ళిపోయింది కోటమ్మ.

హోటేలురెడ్డి పెద్దకొడుకు వీర్రాఘవరెడ్డికి పెళ్లయి పదేళ్ళయ్యినా పిల్లల్లేరు.

ఆ కుర్రోడు మేనరికం చేసుకోడం వల్ల ఇంకో పెళ్ళి చెయ్యలేదుగానీ అదే బయటి సంబంధమైతే ఈపాటికి చేసేద్దురు. అయినా కొంచెం అటూ ఇటూ ఊగుతున్న రెడ్డిపెళ్ళాం పాలసీత ఒకరోజు కోటమ్మతో ఆ ముక్కా ఈముక్కా మాటాడతా ''కొంకుదురుసావరంలో మాంచి సంబందం ఉందట మూఢం వెళ్లేకా మా పెద్దోడికి చేసేద్దాం అనుకుంటున్నాను కోటా'' అంది.

''మీ పెద్దబ్బాయిగారికి పెళ్ళయ్యింది గదమ్మా మరేటిది?'' అంది కోటమ్మ.

''అయ్యి సుకవేంటి దానికి పిల్లల్లేరే. అది గొడ్డిమోద్ది. అన్నగారి కూతురని ఇన్నాళ్ళూ ఊరుకున్నాను ఇక నా వల్ల గాదొలే'' అంది పాలసీత.

క్షణం సేపు ఆలోచించిన కోటమ్మ ''అమ్మా సీతమ్మగారు నా మాట నమ్మి కొంచెం ఓపిక పట్టండి''అని ఆ మర్నాడే పాలసీత పెద్దకోడలు బేబీని నల్లూరులో ఉన్న దన్వంతరీ వైద్యుడి దగ్గరకి తీసుకెళ్ళి పిల్లలు పుట్టడానికి మందిప్పించేసరికి మూడోనెలలోనే ఆ కోడలు నీళ్ళోసుకుంది.

ఒకసారి ఏం జరిగిందంటే పప్పు సుబ్బారావుగారి అబ్బాయి నారాయణరావు అల్లరిచిల్లరగా తిరుగుతా ''కోటమ్మా రాత్రికి నీ దగ్గరకు రానా'' అన్నాడు.

నవ్వింది తప్పా కోప్పడలేదు. ఊరిలో ఎవరికీ చెప్పలేదు.

* * *

కొన్నాళ్ళు గడిచాయి.

ఎప్పుడూ మాసిన చీరని కచ్చాపోసుకుని కట్టుకునే కోటమ్మ. ఒకరోజు కొత్త చీర కట్టుకుని, కచ్చాపోయకండా శ్రీకాకుళం పద్ధతిలో పైనుంచి కిందదాకా విడిచిపెట్టి, సొట్టలు పడిని ట్రంకు పెట్టెలో బట్టలు సర్దుకుని బయల్దేరింది.

ఇంతకాలం నించి ఎప్పుడూ వూరు దాటని కోటమ్మను ''షోగ్గా తయారయ్యావు. ఎక్కడికే ప్రయాణం'' అని అడిగితే ''మా ఆయన వచ్చాడని కార్డు వచ్చింది. గౌసుబావు ఇచ్చేడు. అల్లదిగో తూర్పున ఉన్న మా ఊరు వెళుతున్నా''నని చెప్పి నవ్వుతూ వెళ్ళిపోయిన కోటమ్మ ఎప్పటికీ తిరిగిరాలేదు చెల్లూరు.

ఇది జరిగి చాలా ఏళ్ళయిపోయినా ఇప్పటికీ చెల్లూరు వాళ్ళు మట్టుకు, శ్రీకాకుళం ప్రాంతాలనించి ఎవరు వచ్చినా, కోటమ్మగురించి ఆత్రంగా అడిగి ''మాకు తెలీదు'' అని అనిపించుకుంటూ వుంటారు.

* * *